ఇంటర్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతం

విద్యార్థిని పరీక్ష సెంటర్‌కు పోలీస్ వాహనంలో తరలిస్తున్న టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్, మార్చి 5 : జిల్లాలో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 20 పరీక్ష కేంద్రాల్లో తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదార్‌గౌడ్ తెలిపారు. తొలి రోజు 4,673 మంది విద్యార్థుల్లో జనరల్ విభాగంలో 3,394 మందికి 3,293 మంది హాజరయ్యారని, ఒకేషనల్‌లో 1,279 మందికి 1,133 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. జనరల్ విద్యార్థులు 101 మంది, ఒకేషనల్ విద్యార్థులు 146 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 91శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. అనంతరం ఆదర్శ పాఠశాల పరీక్ష సెంటర్‌ను కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సందర్శించి పరీక్ష సరళి పరిశీలించారు.

విద్యార్థిని తరలించిన పోలీసులు

పట్టణంలో పరీక్ష కేంద్రం విషయంలో తికమక పడ్డ ఓ విద్యార్థిని పోలీస్ వాహనంలో సెంటర్‌కు తరలించారు. బుధవారం బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష రాసేందుకు ఓ విద్యార్థి సెంటర్ తెలియక ఆందోళన చెందాడు. అక్కడే ఉన్న టౌన్ సీఐ దేవేందర్ అతడిని వాహనంలో సరైన సమయంలో సెంటర్‌కు తీసుకెళ్లారు.

రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మిర్చి క్వింటాల్‌కు రూ.25వేలు చెల్లించాలి

కేసముద్రం, మార్చి 5: మిర్చి క్వింటాల్‌కు రూ.25వేల మద్దతు ధర చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యుడు మార్తినేని పాపారావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్‌ను సందర్శించి మిర్చి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో మిర్చి ధర పూర్తిగా పడిపోయిందని ఆరోపించారు. పెట్టుబడి రాక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయన్నారు. రైతు భరోసాను, రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రుణ మాఫీ కాక, రైతుబంధు రాక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. ధాన్యానికి రూ.500 బోనస్ స్తామని చెప్పి కొందరికి ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించారు. గొడిశాల వెంకన్న, చాగంటి కిషన్, జల్లె జయరాజ్, నీరుటి జలేందర్, సోమారపు ఎల్లయ్య, ముద్రకోల శ్రీను, బానోత్ హరిలాల్, వాంకుడోత్ శ్రీను, చాంది, విజయ ఉన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

- మానుకోటలో 7,546 బస్తాలు రాక
- పూర్తిగా నిండిపోయిన షెడ్లు

మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

మహబూబాబాద్ రూరల్, మార్చి 5 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి బుధవారం పోటెత్తింది. రెండు రోజుల వరుస సెలవుల తర్వాత మార్కెట్ తెరుచుకోవడంతో పలు మండలాల నుంచి రైతులు 7,546 మిర్చి బస్తాలను తీసుకువచ్చారు. మార్కెట్ అధికారులు ఉదయం పూట మాత్రమే మిర్చి వాహనాలను లోపలికి అనుమతించగా గార్ల, బయ్యారం నుంచి మిర్చి లోడ్‌తో వచ్చిన వాహనాలు రోడ్డుపైనే ఉంచారు. మార్కెట్లో షెడ్‌లు పూర్తిగా మిర్చి బస్తాలతో నిండిపోవడంతో రైతులు ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ మిర్చి రాగా వ్యాపారులు తక్కువ ధరకు పాడుతున్నారని రైతులు వాపోతున్నారు.

వారం నుంచి ఇక్కడే ఉంటున్నా

మార్కెట్ మొత్తం మిర్చి బస్తాలతో నిండింది. బండ్ల మీద నుంచి బస్తాలు దించటానికి జాగ లేదు. మార్కెట్‌కు మిర్చి తెచ్చి వారం రోజులైంది. కాంటా ఎప్పుడు అయితదో తెల్వదు. రోజూ పొద్దుగాలే ఆన్‌లైన్ కాంటాలకు చిట్టీలు ఇస్తుండ్రు. అప్పుడు లేకపోతే మళ్లీ చిట్టీ కోసం ఎదురు చూడాలి. మార్కెట్‌లో మిర్చికి తగ్గ రేటు లేదు. కింటాకు ధర రూ.12,500 వస్తుంది.

– హలవత్ మంగ్యా, ఈదులపూసపల్లి

కాంటాలు పెట్టడంలేదని రైతుల ఆందోళన

కేసముద్రం మార్కెట్‌లో అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం

కేసముద్రం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో కాంటాలు నిలిచిపోగా, వెంటనే కాంటాలు నిర్వహించాలని మిర్చి రైతులు బుధవారం రాత్రి ఆందోళన దిగారు. మార్కెట్ 5వేల బస్తాల మిర్చి విక్రయానికి వచ్చింది. ఈనామ్ విధానం ప్రకారం ఉదయం 11 గంటల వరకు మిర్చికి వ్యాపారులు ఆన్‌లైన్‌లో టెండర్ వేస్తారు. టెండర్ తర్వాత అధికారులు మధ్యాహ్నం ఒంటిగంట వరకు విన్నర్ లిస్ట్ విడుదల చేస్తారు. విన్నర్ లిస్ట్ ఆధారంగా వ్యాపారులు రైతుల మిర్చి బస్తాలకు కాంటాలు నిర్వహిస్తారు. వ్యాపారులు టెండర్ ఆలస్యంగా వేయడంతో అధికారులు విన్నర్ లిస్ట్‌ను సాయంత్రం విడుదల చేశారు. ఈ మేరకు సాయంత్రం వరకు కాంటాలు కాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ కార్యాలయానికి చేరుకొని ఆందోళనకు దిగారు. వ్యాపారులు చిన్న చిన్న కారణాలు చూపుతూ కావాలనే టెండర్ ఆలస్యంగా వేస్తున్నారని ఆరోపించారు. కాంటాలు త్వరగా నిర్వహించకపోవడంతో ఉదయం నుంచి రాత్రి వరకు మిర్చి యార్డులో ఉండటం వల్ల శరీరం మంట మండుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటాలు ఆలస్యమవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. విషయాన్ని తెలుసుకున్న ఎస్సై మురళీధర్‌రాజ్ చేరుకొని మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వరరావుతో కలిసి రైతులతో మాట్లాడి శాంతింపజేశారు. వ్యాపారులను పిలిపించి కాంటాలు నిర్వహించాలని సూచించడంతో వ్యాపారులు కాంటాలను ప్రారంభించారు.

రైతులతో మాట్లాడుతున్న ఎస్సై మురళీధర్‌రాజ్

బురద గుంతలో పడి రైతు మృతి

గూడూరు, మార్చి 5: ప్రమాదవశాత్తు బురదగుంతలో పడి ఓ రైతు మృతిచెందిన ఘటన మండలంలోని చిర్రకుంటతండాలో జరిగింది. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రైతు భూక్య రాజ్‌కుమార్(35)కు గ్రామ శివారు పాకాలవాగు సమీపంలోని వ్యవసాయ భూమి ఉంది. అందులో చెట్టు ఎక్కి కోతులు పంట నష్టం చేస్తున్నాయి. దీంతో బుధవారం చెట్టు కొమ్మలు నరికేందుకు చెట్టు ఎక్కి కొమ్మలు నరుకుతుండగా జారి పడి పాకాలవాగులో పడ్డాడు. పడిన చోట బురద ఉండటంతో ఊపరి ఆడక చనిపోయాడు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మరిపెడ, మార్చి 5: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేశారు. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బంధంపల్లికి చెందిన పెరుమళ్ల నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పురపాలక సంఘంలోని రాజీవ్‌గాంధీ సెంటర్‌లో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న నిందితులను తహసీల్దార్ సైదులు ఎదుట రూ.లక్ష పూచికత్తుపై బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

బిగబడిన ఆర్టీసీ బస్సు

కొత్తగూడ, మార్చి 5: మండలంలోని కోనాపురం – కొత్తగూడ మార్గ మధ్యలో పొగుళ్లపల్లి సమీపంలో కొత్తగా బిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా పక్క నుంచి తాత్కాలికంగా పైపులు వేసి మట్టిరోడ్డు నిర్మించారు. బుధవారం ఆ రోడ్డు గుండా వెళ్తున్న ఆర్టీసీ బస్సు మట్టిలో దిగబడింది. స్థానికులు జేసీబీ సాయంలో బస్సును బయటకు తీసి గుంత పూడ్చేశారు. మరమ్మత్తుల తర్వాత యథావిధిగా రాకపోకలు సాగాయి.

చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

బయ్యారం, మార్చి 5: చట్టాలను పటిష్టంగా అమలు చేస్తేనే మహిళలకు రక్షణ కలుగుతుందని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊకే పద్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని వెంకట్రాంపురంలో సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా చట్టాలను సరిగ్గా అమలు చేయకపోవటంతో దేశంలో మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు సోమక్క, సాయమ్మ, సుజాత, లక్ష్మీ, శోభ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారించాలి

చిన్నగూడూరు, మార్చి 5: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని టీజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా హరినాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని పగిడిపల్లి శివారు బాబోజితండాలో బుధవారం తెలంగాణ గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటలు వాగుల్లో నీరులేక భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేక గ్రాంట్ మంజూరు చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సంఘ నాయకులు రమేశ్, వాల్య, భీముడు ఉన్నారు.

10న ఎస్సారెస్పీ జలాలు విడుదల

నెల్లికుదురు, మార్చి 5 : ఈనెల 10 నుంచి 16 వరకు ఎస్సారెస్పీ జలాలు పరఫరా చేయనున్నట్లు ఐబీ డీఈ రాందాస్ తెలిపారు. మండలంలోని మునిగలవీడుకు ఎస్సారెస్పీ జలాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు రైతు నల్లానీ పాపారావు ఐబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఐబీ ఏఈ సుష్మాతో కలిసి బుధవారం ఎస్సారెస్పీ కాల్వలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 16 వరకు జలాలు సరఫరా అవుతాయని తెలిపారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

తొర్రూరు, మార్చి 5: మండలంలోని దుబ్బతండా భవానీనగర్‌లో రూ.6.50లక్షల వ్యయంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ డీఈ మధుసూదన్ తెలిపారు. ఏడీ చలపతిరావు, సబ్ ఇంజినీర్ సుధాకర్, లైన్‌మెన్ కసం శ్రీకాంత్, కాంట్రాక్టర్ పనస ప్రవీణ్ పాల్గొన్నారు.

డాక్టర్ సాబ్ లేని లోటు తీరనిది

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో నివాళులు


నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర, మార్చి 5: దివంగత మాజీ మంత్రి నెమరుగొమ్ముల యతిరాజారావు తనయుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు ప్రథమ వర్ధంతి బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. సుధాకర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి చిత్రపటం వద్ద మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చెన్నూరు నియోజకవర్గ ప్రజలకు డాక్టర్ సాబ్ లేని లోటు తీరనిదని.. వారి సేవలు ఎంతో గొప్పవన్నారు. వైద్యరంగంలోనూ ఎన్నో విధాల సేవలు అందించి పేరు ప్రఖ్యాతలు ఘటించారని కొనియాడారు. జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ ప్రవీణ్‌రావు, ప్రదీప్‌రావు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

సమస్యలపై పోస్ట్ చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

డోర్నకల్, మార్చి 5: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. డోర్నకల్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు బుధవారం పోస్ట్‌కార్డుపై తమ సమస్యలు రాసి పోస్టుబాక్స్‌లో వేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల స్టేట్ సెక్రటరీ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యమకారులకు 200గజాలు ఇళ్ల స్థలం, ఉద్యోగం, పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల జిల్లా ఉపాధ్యక్షుడు మేకల రామారావు, పట్టణ అధ్యక్షుడు మామిడి నాగరాజు, మండల అధ్యక్షుడు అజ్మీరా పర్శీయానాయక్, డివిజన్ కన్వీనర్ బోడ రమేశ్, మైనార్టీ కన్వీనర్ అజ్‌గర్, మైనార్టీ మండల ప్రెసిడెంట్ గౌస్‌పాషా పాల్గొన్నారు.

మానవ జీవనంలో సైన్స్ ఒక భాగం

డోర్నకల్, మార్చి 5: మానవ జీవనంలో సైన్స్ ఒక భాగమని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. బుధవారం డోర్నకల్ జడ్పీ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్ ప్రారంభించి, విద్యార్థుల ఎగ్జిబిట్స్ పరిశీలించారు. ఎస్‌బీఐ సహకారంతో 10 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సబ్జెక్ట్‌ను తేలికైన పద్ధతిలో చదివి అర్థం చేసుకోవాలన్నారు. పాఠశాలల్లో బోధించే అంశాలపై తల్లిదండ్రులు విద్యార్థులకు నేర్పించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. డీఈవో రవీందర్‌రెడ్డి, ఏఎంవో ఆజాద్, హెచ్ఎం బండి నరసింహరావు, ఎస్‌బీఐ మేనేజర్ సుధాకర్, ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, సాహెబ్ అలీ, వసంతరాణీ, అమీనా, కమల, శంకర్, బిచ్చు పాల్గొన్నారు.

వడదెబ్బ తో వృద్ధుడి మృతి

సాయిలు (ఫైల్)

మరిపెడ, మార్చి 5: వడదెబ్బకు గురై ఓ వ్యక్తి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన కంచనపల్లి సాయిలు(70) పని నిమిత్తం బంగ్లాకు వెళ్లాడు. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో స్పృహ తప్పి కింద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చిక్సితపొందుతూ మృతిచెందాడు. మృతుడికి కూతురు ఉంది. కాగా, సాయిలు భౌతికకాయంపై బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ ఎడేల్లి పరశురాములు పూలమాల ఉంచి నివాళులర్పించారు. బాసిపంగు గురువయ్య, వీరయ్య, ఏడెల్లి ఉప్పలయ్య, సత్యనారాయణ, వేణు, సైదులు, దశరథం, బొందయ్య, ఉప్పలయ్య, వీరయ్య పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లోనే మందు పార్టీ

విధులు మరిచి మత్తులో సిబ్బంది

పోలీస్‌స్టేషన్‌లో మద్యం విందులో సిబ్బంది

పెద్దవంగర, మార్చి 5: పోలీసులు మద్యం తాగేందుకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌నే అడ్డాగా మార్చుకున్నారు. హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు కలిసి బుధవారం రాత్రి స్టేషన్‌లోనే మందు పార్టీ చేసుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఓ విలేకరిపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తుండగా ఫిర్యాదు చేయడానికి వెళ్లిన సమయంలో పోలీసులు విధులు మరిచి మద్యం విందులో ఉన్నారు. ఈ దృశ్యాలను కెమెరాలో బంధించేందుకు యత్నించిన ఓ విలేకరిని పోలీసులు తీవ్రంగా బెదిరించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లికుదురు, మార్చి 5: సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చిర్ర రమేశ్‌బాబు అన్నారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సైబర్‌నేరాలపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, పోలీసుల పేరు చెప్పి డబ్బులు ఫోన్‌పే చేయాలని వచ్చే రాంగ్‌కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని చెప్పారు.

ఎల్ ఆర్ ఎస్ ఫీజు చెల్లిస్తే రాయితీ

పురపాలక సంఘం కమిషనర్ నరేష్‌రెడ్డి

మాట్లాడుతున్న కమిషనర్ నరేష్‌రెడ్డి

మరిపెడ, మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వం లే అవుట్లను క్రమబద్ధీకరించేందుకు మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తే 25శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినట్లు పురపాలక సంఘం కమిషనర్ నరేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం పురపాలక సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. పురపాలక సంఘం పరిధిలో 1,248 ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై ప్రజలకు సందేహాలు ఉంటే కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలని సూచించారు. టోల్ ఫ్రీ 9110788764, 95506 05700 నంబర్లకు కూడా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కాగా, పురపాలక సంఘం పరిధిలోని ఇంటి పన్నులు రూ.1కోటీ 71లక్షల పన్నులకు గాను రూ.91లక్షలు మాత్రమే వసూలైనట్లు తెలిపారు. మార్చి 31లోగా ఆస్తి పన్ను చెల్లించకుంటే రెడ్ నోటీస్ జారీ చేస్తామని హెచ్చరించారు. పురపాలక సంఘం మేనేజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ వీరన్న పాల్గొన్నారు.

వాహనాల వేలంలో వాగ్వాదం

మహబూబాబాద్ రూరల్, మార్చి 5 : పట్టణంలోని ఎక్సైజ్ డివిజన్ ఆఫీస్‌లో బుధవారం వాహనాల వేలం పాటలో వాగ్వాదం జరిగింది. మానుకోట డివిజన్ పరిధిలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పట్టుకున్న వాహనాల వేలం పాట ఏర్పాటు చేశారు. గతంలో నిర్వహించిన వాహనాల వేల పాట సక్రమంగా నిర్వహించలేదని, వాటి సమస్యలు పరిష్కరించాలని అధికారులతో డోర్నకల్, గార్లకు చెందిన వారు వాగ్వాదానికి దిగారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్ వారికి సర్దిచెప్పి వాహనాల వేలం పాట కొనసాగించారు.

బడ్జెట్ పత్రాలు దహనం చేస్తున్న రైతు సంఘాలు

వ్యవసాయ నిధుల కోతపై రైతు సంఘాల నిరసన

తొర్రూరు, మార్చి 5: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ నిధులకోతను నిరసిస్తూ వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో తొర్రూరు గాంధీ విగ్రహం వద్ద బడ్జెట్ పత్రాలను దహనం, రాస్తారోకో చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న, సీపీఐ రాష్ట్ర నాయకుడు తమ్మెర విశ్వేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 6న జిల్లా కేంద్రంలో, మార్చి 10న రాష్ట్ర స్థాయిలో రైతు సంఘాలు చేపట్టే ఆందోళనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, సీపీఎం జిల్లా నాయకులు బొల్లం అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

విద్యార్థి విష్ణువర్ధన్‌కు షీల్డ్, సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్ రూరల్, మార్చి 5 : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఫిజిక్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఫిజిక్స్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన మాధవాపురం జడ్పీ పాఠశాల విద్యార్థి నక్క విష్ణువర్ధన్‌ను కలెక్టర్ అభినందించారు. భవిష్యత్‌లోనూ సైన్స్‌రంగంలో బాగా రాణించాలన్నారు. విష్ణువర్ధన్‌కు సర్టిఫికెట్, షీల్డ్ అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, పాఠశాల హెచ్ఎం సంకా బద్రీనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం బోనస్ డబ్బులు చెల్లించాలి

మహబూబాబాద్ రూరల్/దంతాలపల్లి , మార్చి 5: ధాన్యం బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి గుజ్జు దేవేందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొందరు రైతులకే బోనస్ వేసిందని, దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దేవిరెడ్డి, వెంకటరెడ్డి, సోమనర్సన్న, బాబు, వెంకట్, నారాయణ పాల్గొన్నారు. సీపీఎం, న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో దంతాలపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరారు. ఎస్సారెస్పీ కాల్వలతో చెరువులు, కుంటలు నింపి పంటలకు సాగునీరు అందించాలని కోరారు. నాయకులు మోహన్, లింగన్న, శ్రీనివాస్, రామేశ్వరన్, యాకన్న, సుధాకర్, సోమిరెడ్డి, మధు, వెంకటరమణ పాల్గొన్నారు.

'యువ విజ్ఞానం'కు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 5 : విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు అంతరిక్ష పరిశోధన సంస్థ యువ విజ్ఞాన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా సైన్స్ అధికారి అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇస్రో ప్రయోగాలను ఇటీవల వంద పూర్తి చేసిందని, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 23లోగా ఆన్‌లైన్ ద్వారా అప్లై చేసుకోవాలని, ఎంపికైన జాబితా ఏప్రిల్ 7న విడుదల చేసి, మే 19న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రషర్ యజమానిపై చర్యలు తీసుకోవాలి

కురవి, మార్చి 5: మండల కేంద్రం శివారు శివసాయి క్రషర్ కంపెనీ యజమానిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నామమాత్రపు అనుమతులతో ఎక్కువ విస్తీర్ణంలో క్రషర్ నడుపుతున్నారని ఆరోపించారు. యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, బుడమ వెంకన్న, సారయ్య, అనిల్ పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 5: మల్యాల జేవీఆర్ ఉద్యాన వన కేంద్రంలో పనిచేసి మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథి అన్నారు. బుధవారం మల్యాల ఉద్యాన కళాశాల ఏడీ వెంకటేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా టైంస్కేల్‌తో పనిచేసిన కార్మికులు మరణించినట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు నూతనంగా ఏర్పాటైన ఉద్యాన కళాశాలలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. పెరుగు కుమార్, షరీఫ్, శ్రీనాథ్, కిరణ్, వెంకన్న, యాకుబ్ పాల్గొన్నారు.

అంత్యక్రియలు నిర్వహించిన స్నేహితులు

అంత్యక్రియల్లో పాల్గొన్న సునిల్ స్నేహితులు

కేసముద్రం, మార్చి 5: నిరుపేద కుటుంబానికి చెందిన కొమ్ము సునిల్ అనారోగ్యంతో బుధవారం మృతిచెందగా చిన్ననాటి స్నేహితులు అంత్యక్రియలు నిర్వహించారు. దహన సంస్కారణకు డబ్బులు లేకపోవడంతో విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు 2006–07 విద్యా సంవత్సరంలో కేసముద్రం విలేజ్ హైస్కూల్‌లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు తలా కొన్ని డబ్బులు విరాళంగా వేసుకొని రూ.20వేలు ఖర్చు చేసి అంత్యక్రియలు నిర్వహించారు. కొమ్ము నరేష్, నారబోయిన సురేష్, గుండు నగేష్, మడిపెద్ది వెంకటేష్, జలిగల శ్రీకాంత్, కొమ్ము శైలజ, రాము, సురేష్ ఉన్నారు.

హక్కుల కోసం మహిళలు పోరాడాలి

తొర్రూర్, మార్చి 5: మహిళలు హక్కుల కోసం పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) నాయకురాలు పల్లె సోమక్క పిలుపునిచ్చారు. ఈనెల 1 నుంచి 8 వరకు మహ